డిఫెన్స్ అకాడమీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనీల్‌కుమార్‌రెడ్డి

యువత దేశ రక్షణలో భాగస్వాములు కావాలి

● ఎమ్మెల్యే కుంభం అనీల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జనవరి 19 : యువత దేశ రక్షణలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కుంభం అనీల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని రాయగిరి 4వ వార్డులో ఏఎన్ డిఫెన్స్ అకాడమీ గ్రౌండ్‌ను ప్రారంభించి మాట్లాడారు. యువత చదువుతూనే దేశ రక్షణ కోసం శిక్షణ పొందడం సంతోషకరమన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా ఇలాంటి శిక్షణ ఏర్పాటు చేసిన ఏఎన్ డిఫెన్స్ అకాడమీ నిర్వాహకులు మొగిలిపాక అశోక్‌కుమార్, నవీన్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కృష్ణయ్య, ఎంపీపీ నరాల నిర్మల, వలిగొండ ఎంపీపీ నూతి రమేశ్‌రాజు, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోత్నక్ ప్రమోద్‌కుమార్, కౌన్సిలర్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఈరపాక నరసింహ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తంగళ్లపల్లి రవికుమార్, సర్పంచులు ఎదునూరి ప్రేమలతామల్లేశం, ఎల్లంల శాలినీజంగయ్య, కాశపాక అరుణానరేశ్, చిక్కుల వెంకటేశం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎలిమినేటి కృష్ణారెడ్డి, కూర వెంకటేశ్, రాయగిరి మాజీ వార్డు సభ్యుడు పల్లర్ల యాదగిరి, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మైలారం వెంకటేశ్, మండల కార్యదర్శి బొల్లెపల్లి అశోక్ పాల్గొన్నారు.

గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి అర్బన్ : గురుకుల పాఠశాల, కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనీల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరి మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాల దరఖాస్తుల కరపత్రాన్ని శుక్రవారం పట్టణంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ గండ్ర శ్రీకాంత్ మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి గానూ పాఠశాల, కళాశాలలో ప్రవేశానికి ఫిబ్రవరి 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ హమీద్ పాషా, వార్డెన్ షానూర్‌బాబా, వేదప్రకాశ్, రహమత్ ఆలీ, మైనార్టీ నాయకులు మజర్, అబేద్ ఆలీ, తంగళ్లపల్లి రవికుమార్, పోత్నక్ ప్రమోద్‌కుమార్, వెంకటేశ్వర్లు, కృష్ణయాదవ్, సత్యనారాయణ, దేవరకొండ నర్సింహాచారి, చిక్కుల వెంకటేశ్ పాల్గొన్నారు. భువనగిరి పట్టణ పరిధిలోని సింగన్నగూడెం చౌరస్తా సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైన యువకుడిని ఎమ్మెల్యే కుంభం అనీల్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. వెంటనే దవాఖానాకు తరలించి మెరుగైన వైద్యాన్ని అందించాలని నాయకులకు సూచించారు.

ప్రభుత్వ భూమికి రక్షణ కరువు

కబ్జాదారుల చేతుల్లో 4 కోట్ల విలువైన 9 ఎకరాలు

● హెచ్చరిక బోర్డులు మాయం
● భూమిని దున్ని నాటు వేసిన ఆక్రమణదారులు

మోత్కూరు, జనవరి 19 : పేదలు పోరాటాలు చేసి ప్రభుత్వ ఆధీనంలో పెట్టిన శిఖం భూములకు రక్షణ కరువైంది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు ఆక్రమణదారులు కబ్జా పెడుతున్నారు. విలువైన సాగు యోగ్యమైన భూమిని దారదత్తం చేసుకోవడం కోసం ప్రయత్నిస్తున్నారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బిక్కేరు వాగు పరివాహక ప్రాంతంలో సుమారు రూ.4 కోట్ల విలువైన 9 ఎకరాల నద్దీనాలకు చెందిన ప్రభుత్వ శిఖం భూమి ఉన్నది. ఈ భూమి ప్రభుత్వ రికార్డుల్లో నమోదు కాకుండా శిఖం కిందనే ఉన్నది. అదే భూమిలో కొండగడప జంట చెరువులకు వరద నీళ్లు వెళ్లే పర్రె కాల్వను పూడ్చి మిషన్ భోర్లు వేసి సేద్యం చేస్తున్నారు. దీనిపై కన్నేసినా కొందరు అక్రమణదారులు 2011లో తాసీల్దార్ కార్యాలయంలో కొంత మంది అధికారులతో కుమ్మక్కై అక్కడి భూములతో సంధానం లేని సర్వే నంబర్ 1,084 పేరుతో పట్టా చేయించుకునేందుకు ప్రయత్నించారు. ఈ విషయమై అప్పటి కలెక్టర్‌కు పేదలు ఫిర్యాదు చేయడంతో జిల్లా రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి విచారణ జరిపిన అనంతరం ప్రభుత్వ భూమిగా గుర్తించి అప్పటి కలెక్టర్ ముక్తేశ్వర్ రావు ఆదేశాల మేరకు ఉత్తర్వు నం. ఎఫ్1/439/2012 తేది. 28-1-12 ప్రకారంగా అధికారులు సదరు భూమిలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి భూమిని స్వాధీనపరుచుకున్నారు. అప్పటి నుంచి భూమి ప్రభుత్వం ఆధీనంలోనే ఉన్నది. ఈ భూమిని ఎవరైనా ఆక్రమించినచో చట్టరీత్యా సివిల్, క్రిమినల్ చర్యలుంటాయని హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. కాగా ఆక్రమణదారులు హెచ్చరిక బోర్డులను తొలగించారు. గత నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిని ఆక్రమణదారులు మళ్లీ కబ్జా చేసి భూమిలో ఉన్న విలువైన కలప చెట్లను జేసీబీతో తొలగించి చదును చేసి దున్నకం పనులు చేశారు. విషయం తెలుసుకున్న అక్కడి పేదలు తాసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తాసీల్దార్ ఆదేశాలనూ పట్టించుకోకుండా కబ్జాదారుల్లో ఒకరు పొలా న్ని దున్ని నాటు వేయగా మిగతా వారు దున్నకం పనులను చేపడుతున్నారు. ఆక్రమణదారుల ఆగడాలను కట్టడి చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని ఇటీవల కలెక్టర్‌కు పేదలు విన్నవించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

2012లో అప్పటి అధికారులు పెట్టించిన హెచ్చరిక బోర్డు

ప్రభుత్వ భూమిలో ఆక్రమితదారులు సాగు చేసిన వరి పంటను పరిశీలిస్తున్న ఆర్ఐ సుమన్, సిబ్బంది

ఆక్రమిత భూమి పరిశీలన

మోత్కూరు, జనవరి 19 : మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలోని బిక్కేరు పరీవాహక ప్రాంతంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాసీల్దార్ కార్యాలయం అధికారులు శుక్రవారం పరిశీలించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుమన్, సర్వేయర్ కలిసి క్షేత్ర పరిశీలన చేశారు. 2012 నుంచి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిని సమీప భూముల వారు కొందరు ఆక్రమించి సేద్యం చేస్తున్నట్లు తాసీల్దార్ రాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మాల మహానాడు ప్రధాన కార్యదర్శి బోడ బాబూరావు, జి.ఆనందం, అచ్చయ్య, చిట్టిమల్ల దేవయ్య, నర్సయ్య, నర్సింహాచారి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

మోత్కూరు బిక్కేరు సమపంలో ఉన్న తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడి భూమి లేని పేదలను పంపిణీ చేయాలి. గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో మళ్లీ కబ్జా చేసి నాట్లు వేస్తుంటే అడ్డుకున్నాం. అధికారులు చొరవ తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడి ఆక్రమణదారులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి.

– బోడ బాబూరావు, మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు, మోత్కూరు

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు

మోత్కూరు మున్సిపాలిటీలోని బిక్కేరు వాగు వెంట ఉన్న నద్దినాల భూమిలో ఆక్రమితదారులు వరి నాటు వేశారు. అక్కడి పేదలు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. సిబ్బందితో క్షేత్ర పరిశీలన చేశాం. ప్రభుత్వానికి నివేదిక అందజేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ చట్టం ప్రకారం ఆక్రమితదారులపై చర్యలు తీసుకుంటాం.

– డి.రాంప్రసాద్, తాసీల్దార్, మోత్కూరు

పవన్ మోటార్స్ మారుతీ షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనీల్‌కుమార్‌రెడ్డి

యువత వ్యాపార రంగంలో రాణించాలి

● పవన్ మోటార్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే అనీల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, జనవరి 19 : యువత వ్యాపార రంగంలో రాణించాలని ఎమ్మెల్యే కుంభం అనీల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన పవన్ మోటార్స్ మారుతీ షోరూంను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పవన్ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ కోమటిరెడ్డి చంద్రపవన్‌రెడ్డి, బిజినెస్ మేనేజర్ రవిరెడ్డి, హెచ్ఆర్ సుధాకర్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలందరికీ ఉపాధి కల్పించాలి

● డీఆర్డీఓ నాగిరెడ్డి

సమీక్షలో మాట్లాడుతున్న డీఆర్డీఓ నాగిరెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జనవరి 19 : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా కూలీలందరికీ పని కల్పించాలని డీఆర్డీఓ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి త్వరలో నిర్వహించే సామాజిక తనిఖీలకు సిద్ధంగా ఉండాలన్నారు. నర్సరీలు, మొక్కల పెంపకాలను సమగ్రంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఏపీడీ శ్యామల, ఎంపీఓ అనూరాధాదేవి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

● డీటీఓ రవీందర్

గూడూరు టోల్ ప్లాజా వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖ సిబ్బంది

బీబీనగర్, జనవరి 19 : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు ఖచ్చితంగా పాటించాలని డీటీఓ రవీందర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని గూడూరు టోల్ ప్లాజా వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులు భద్రతా నియమాలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరుగవన్నారు. డ్రైవింగ్‌లో సెల్ ఫోన్ వాడడం అత్యంత ప్రమాదకరమని, మద్యం తాగి వాహనాలు నడుపవద్దని సూచించారు. కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది, టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ మానవత్వం

యాదగిరిగుట్ట, జనవరి 19 : శాంతి భద్రత పరిరక్షణలో కఠినంగా వ్యవహరించడమే కాదు అభ్యాగుల పట్ల మానవత్వ చూపడం కూడా తమలో ఉన్నదని నిరూపించాడు ఈ పోలీస్. శుక్రవారం ఉదయం చలికి వణుకుతూ, డొక్క పీక్కుపోయి బతుకు జీవుడా అంటూ కనిపించిన భిక్షాటన చేసే ఓ అనాథ వృద్ధుడిని చూసి యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ చలించిపోయాడు. మంచినీళ్లు అందజేసి అల్పాహారం స్వయంగా తినిపించి ఆకలి తీర్చాడు. అంతే కాకుండా వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతుండడాన్ని గమనించి అంబులెన్స్ సాయంతో భువనగిరి జిల్లా ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతున్న వృద్ధుడు ప్రస్తుతం క్షేమంగా ఉన్నాడు. హెడ్ కానిస్టేబుల్ మానవతపై పలువురు ప్రశంసించారు.

వృద్ధుడికి అల్పాహారం తినిపిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్

వినోద రైస్ మిల్లును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

● అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 19 : కస్టమ్ మిల్లింగ్ రైస్ లక్ష్యాలను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్‌రావు మిల్లర్లకు సూచించారు. శుక్రవారం పట్టణ పరిధిలోని వినోద రైస్ మిల్లులో సీఎంఆర్ పనులను ఆయన పరిశీలించారు. మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

బీసీ గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

చౌటుప్పల్, జనవరి 19 : బీసీ గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం చౌటుప్పల్ పట్టణంలో బీసీ యువజన సంఘం నియోజకవర్గ కమిటీ రూపొందించిన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ కులగణన నిర్వహించి రిజర్వేషన్లు 42శాతం పెంచుతామన్న మాట నెలబెట్టుకోవాలన్నారు. ఇందుకోసం తక్షణమే కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించి, 60శాతం ఉన్న బీసీలకు కేవలం 18శాతం కల్పించడం సరికాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, మునుకుంట్ల సత్యనారాణ గౌడ్, సుర్వి యాదయ్య గౌడ్, వీరమల్లల కార్తీక్ గౌడ్, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

24న జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి అర్బన్, జనవరి 19 : ఈనెల 24న అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.జయరాజు అన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ, జిల్లా బాలల సంక్షేమ శాఖ సంయుక్తంగా కోర్టు ఆవరణలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల హక్కులు, సంక్షేమం, బాల్య వివాహాల నిషేదం, బాల కార్మిక నిర్మూలన, మానవ అక్రమ రవాణా అంశాలపై వీడియో ఫిల్మ్‌స్కిట్, సమూహ చర్చ కార్యాక్రమాలపై పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ కె.దశరథ రామయ్య, డీఈఓ నారాయణరెడ్డి, సీడబ్ల్యూసీ చైర్మన్ జయశ్రీ, జీసీడీఓ నిర్మల జ్యోతి, డీసీపీఓ సైదులు పాల్గొన్నారు.

రైతు బంధు నిధులు విడుదల చేయాలి

● రైతు బంధు సమితి మాజీ మండల కోఆర్డినేటర్ జైపాల్‌రెడ్డి

జైపాల్‌రెడ్డి

బీబీనగర్, జనవరి 19 : రాష్ట్రంలో రైతు బంధు నిధులు తక్షణమే విడుదల చేయాలని రైతు బంధు సమితి మాజీ మండల కోఆర్డినేటర్ బొక్క జైపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు గడుస్తున్నా రైతు బంధు నిధులు మాత్రం మంజూరు చేయడం లేదని, పథకాల పేర్లు మార్చడం కాకుండా వాటిని అమలు చేస్తేనే ప్రజలు గుర్తిస్తారని పేర్కొన్నారు. ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని తెలిపారు. తక్షణమే యుద్ధ ప్రాతిపదికన రైతు బంధు నిధులు విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేయాలని, లేకుంటే రైతులతో కలిసి గ్రామగ్రామాన నిరసన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

యూరియా కేంద్రం తనిఖీ

ఆలేరు రూరల్, జనవరి 19 : మండలంలోని గొలనుకొండలో ఆలేరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యూరియా విక్రయ కేంద్రాన్ని శుక్రవారం ఏఓ దీప్తి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి స్టాక్ వివరాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో తల్లీకూతురికి గాయాలు

రాజాపేట, జనవరి 19 : మండలంలోని రఘునాథపురంలో శుక్రవారం విద్యుదాఘాతంతో తల్లీకూతురికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన దేవనపల్లి చంద్రకళ కూతురు పుట్ట నిర్మల తల్లిగారింటికి వచ్చింది. నిర్మల కూతురు(3) మేడ మీద ఆడుకుంటుండగా చిన్నారిని కిందకు తీసుకరావడానికి ఇద్దరు మేడ పైకి వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలాయి. చంద్రకళకు సల్పగాయాలు కాగా పుట్ట నిర్మలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్త భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ దవాఖానకు తీసుకెళ్లారు.

ఆరు గ్యారెంటీల పేరుతో మోసం చేస్తున్న కాంగ్రెస్

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్

ఆత్మకూరు(ఎం), జనవరి 19 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే రైతు బంధును ఇవ్వడంతో పాటు రుణమాఫీ చేస్తామని, పింఛన్ల పెంచుతామని చెప్పి 42రోజులు దాటినప్పటికీ మాటలతో మాయ చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల ప్రజా పాలన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి పథకాలు వర్తింపజేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, కొరె భిక్షపతి, గడ్డమీది రమేశ్‌గౌడ్, మండల సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గడ్డం దశరథగౌడ్, సత్తయ్య, భద్రయ్య, ఆంజనేయులు, చంద్రయ్య పాల్గొన్నారు.

బీబీనగర్‌కు నేడు కేంద్ర మంత్రి ఆర్‌కే సింగ్ రాక

బీబీనగర్, జనవరి 19 : వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర విద్యుత్, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ఆర్‌కే సింగ్ శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు బీబీనగర్ ఎయిమ్స్‌లో పాల్గొంటారని కలెక్టర్ హనుమంతు కె జెండగే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం సాయంత్రం 5.30గంటలకు యాదగిరిగుట్ట ఆలయ అతిథి గృహానికి చేరుకొని రాత్రి బస చేస్తారని, 21న ఆదివారం ఉదయం 10 గంటలకు జనగాం జిల్లా పెంబర్తికి బయలుదేరి వెళ్తారని పేర్కొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 19 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం మున్సిపల్ కార్మికులు సమ్మె చేపట్టారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న కార్మికులకు మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏరియర్స్‌ను ఇప్పించాలని, ప్రతినెల 5 వరకు వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్మికులు చేపట్టిన సమ్మెకు పద్మశాలీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకింది కిరణ్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కుక్క నరేశ్, కె.బాలయ్య, శంకర్, రాజు, బాబు, పరమేష్, హరికృష్ణ, బాలస్వామి, లింగయ్య, సత్తయ్య, రాములు, బుచ్చయ్య, కొండల్, శివ, సాగర్, విక్రమ్, వెంకటేశ్, నిర్మల, సబిత, లలిత, కృష్ణవేణి, నాగమ్మ, బుచ్చమ్మ, సబిన్, లక్ష్మమ్మ, చంద్రకళ, మమత పాల్గొన్నారు.

మొగిలిపాకలో మల్లికార్జునస్వామి ఆలయాన్ని సందర్శించిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

ఆధ్యాత్మిక భావనతోనే మానసిక ప్రశాంతత

● బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, జనవరి 19 : ఆధ్యాత్మిక భావనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ముద్దసాని కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మొగిలిపాకలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి ఆలయాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు మర్ల మల్లేశం, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు భిక్షపతి, ఆలయ కమిటీ చైర్మన్ సత్యరాములు, నర్సింహ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా గీత

భువనగిరి అర్బన్, జనవరి 19 : మున్నూరుకాపు సంఘం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా భువనగిరికి చెందిన సాధినేని గీత నియమితులయ్యారు. ఈ మేరకు మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు నియామక పత్రాన్ని అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ తనకు అధ్యక్ష పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సంఘ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మున్నూరుకాపు సంఘం ఉపాధ్యక్షుడు మణికొండ రమేశ్, కోశాధికారి లింగిశెట్టి హన్మంతురావు, తాడెం రమేశ్ పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

రామన్నపేట, జనవరి 19 : మండలంలోని కక్కిరేణి ప్రాథమిక పాఠశాలకు అగ్రికల్చర్ ఎంప్లాయిస్ మిత్రులు ముసుజు నరేశ్, బెజ్జంకి శివకుమార్, కన్నెబోయిన నరేశ్ శుక్రవారం మైక్ సెట్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కనకసేన, ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, గణేశ్, యోగితాబాలి, సామాజిక కార్యకర్త వేముల సైదులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సంస్థాన్‌నారాయణపురం, జనవరి 19 : మండల కేంద్రానికి చెందిన నీళ్ల నరసింహ అనారోగ్యంతో మృతి చెందగా.. పీఏసీఎస్ చైర్మన్ జక్కిడి జంగారెడ్డి రూ.5వేలు, కాంగ్రెస్ నాయకులు ఉప్పల లింగస్వామి రూ.5వేలు, గుత్తా ప్రేమ్‌చందర్ రెడ్డి రూ.5వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు లారీ భిక్షం, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఏపూరి సతీశ్, జక్కిడి చంద్రారెడ్డి, జక్కిడి యాదిరెడ్డి, రాసాల వెంకటేశ్, కోన్‌రెడ్డి నరసింహ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌పురంలో వైద్య శిబిరం

ఆలేరు రూరల్, జనవరి 19 : మండలంలోని శ్రీనివాస్‌పురంలో మల్లారెడ్డి నారాయణ దవాఖాన ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్ల నవ్యాశోభన్‌బాబు, వైద్య సిబ్బంది తానుశ్రీ, శిరీష, అర్చన, కిరణ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

● బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు దయాకర్

గుండాల, జనవరి 19 : ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు కొమ్మగళ్ల దయాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోడ్రైవర్లు ఉపాధి కోల్పోయారని వారికి జీవన భృతిని అందించాలన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటోడ్రైవర్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆటో డ్రైవర్లను ఆదుకోకుంటే వారి ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదన్నారు.